WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ | బుధవారం, మే 27, 2026 | సంపుటి:13 | సంచిక : 5 | పేజీలు: 4 | వెల : రూ.5

# సీల్ ఉంది... సైన్ ఉంది

## రికార్డుల్లో మాత్రం 'జీరో' మున్సిపల్ ఆఫీసా? మాయాబజారా?










**అశ్వారావుపేట మున్సిపల్ కార్యాలయంలో వింతలు, విశేషాలు రోజురోజుకూ ముదిరిపోతున్నాయి. దరఖాస్తుదారుడి వద్ద మున్సిపల్ ఆఫీస్ అధికారిక ముద్ర, ఇన్‌వార్డ్ సిబ్బంది పెట్టిన సంతకంతో కూడిన 'రిసీవ్డ్ కాపీ' కళ్లముందే పక్కా ఆధారంగా కనిపిస్తోంది. కానీ, లోపల ఉన్న రిజిస్టర్లలో చూస్తే మాత్రం ఆ దరఖాస్తు ఊసే లేదు.**

సీల్ వేసి, సంతకం పెట్టి తీసుకున్న అప్లికేషన్ గాల్లో కలిసిపోయిందా?

సమాచారం ఇస్తే ఎక్కడ తమ అవినీతి గుట్టు, లొసుగులు బయటపడతాయనే భయంతో కొందరు అధికారులు కావాలనే దాన్ని తొక్కిపెట్టారా?

**లేక ప్రజల హక్కులను చెత్తబుట్టలో పడేశారా?**

బాధితుడు సమాచారం కోసం వెళ్తే 'రికార్డుల్లో లేదు' అంటూ సిబ్బంది చేతులెత్తివేయడం ఇక్కడి పారదర్శకతకు పట్టిన తుప్పును చూపిస్తోంది. అధికారిక పత్రాలనే మాయం చేస్తున్న ఈ 'మాయాబజార్' వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సాబ్ విచారణ జరిపి,బాధ్యులైన అధికారుల పై చర్యలు తీసుకోవాలి అంటున్న ప్రజలు


2లో



3లో

## కళ్లముందే తోట కాలిపోయింది

"మొదట వెదురు తోటలో మంటలు కనిపించాయి. కొద్దిసేపటికే మా పామాయిల్ తోటలోకి వచ్చేశాయి. రెండు ఎకరాల తోట పూర్తిగా కాలిపోయింది. ఎన్నో సంవత్సరాల శ్రమ కళ్లముందే బూడిదైంది. అధికారులు వచ్చి నష్టం అంచనా వేసి న్యాయం చేయాలి" అని బాధిత రైతు ఆళ్ల వెంకటేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు.



## అశ్వారావుపేట

# కోఆప్షన్ పోరు

### ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యూహాలకు పదును

### మున్సిపాలిటీ పరిధిలో హీటెక్కుతున్న రాజకీయం..

### అనుభవానికే పట్టం కట్టాలని ప్రజల డిమాండ్

నవతరం ప్రతినిధి, ఖమ్మం – భద్రాద్రి కొత్తగూడెం మే 25, 2026 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకూ హీటెక్కుతున్నాయి. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేసి, చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. ఇప్పుడు మున్సిపల్ పరిపాలనలో తుది అంకమైన 'కోఆప్షన్' సభ్యుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన అశ్వారావుపేటలో కాంగ్రెస్ తన తిరుగులేని ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ఈ కోఆప్షన్ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి.

**ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యూహాత్మక మార్క్**

ఈ మొత్తం రాజకీయ పరిణామాల్లో అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ శాసనసభ్యులు జారే ఆదినారాయణ కేంద్ర బిందువుగా నిలిచారు. మున్సిపాలిటీ ఏర్పాటు ప్రక్రియ దగ్గరి నుంచి, మొన్నటి ఎన్నికల్లో ప్రతిపక్ష బిఆర్ఎస్ గట్టి పోటీని అధిగమించి కాంగ్రెస్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేలా చేయడంలో ఆయన వేసిన రాజకీయ వ్యూహాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఇప్పుడు కోఆప్షన్ సభ్యుల ఎంపికలోనూ ఎమ్మెల్యే ఆదినారాయణ తన మార్క్ చూపించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన క్యాడర్‌ను బ్యాలెన్స్ చేస్తూనే, నూతన మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడేలా సమర్థులైన అభ్యర్థులను రంగంలోకి దించాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా,



మైనారిటీలకు అలాగే నిపుణులకు సరైన ప్రాధాన్యత దక్కేలా ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేశారు.

**ఆశావహుల జోరు.. అనుభవజ్ఞులకే ప్రజల ఓటు**

మున్సిపాలిటీలో కోఆప్షన్ స్థానాల సంఖ్య పరిమితంగా ఉండటం, ఆశావహుల జాబితా లీడర్ల స్థాయిలో ఎక్కువగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి ఇది సవాల్‌గా మారింది. అయితే, స్థానిక ప్రజల నుంచి మాత్రం స్పష్టమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది. "రాజకీయ పునరావాసం లేదా కేవలం పార్టీ సమీకరణాల కోసమే కాకుండా..

(మిగతా 2వ పేజీలో)



# పసిడి మోసాలు

# సరిహద్దు దోపిడీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో కొందరు బంగారు వ్యాపారుల అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నమ్మకమే పెట్టుబడిగా సాగే పవిత్రమైన పసిడి వ్యాపారాన్ని కొందరు కిలాడీ వ్యాపారులు అపహాస్యం పాలు చేస్తున్నారు. అమాయక కస్టమర్ల అవసరాన్ని ఆసరాగా చేసుకొని, చట్టబద్ధమైన నిబంధనలను తుంగలో తొక్కుతూ కోట్లలో పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారు. స్థానిక వ్యాపారుల నమ్మకద్రోహాన్ని భరించలేక, సరైన న్యాయం కోసం అశ్వారావుపేట మరియు చుట్టుపక్కల ప్రాంతాల కొనుగోలుదారులు పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెం, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు వంటి సుదూర ప్రాంతాల వైపు పరుగులు తీస్తుండటం ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది.

- 'కచ్చా' బిల్లుల గుట్టుమట్టు, ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- నకిలీ హాల్‌మార్క్ తంతు,నిలువునా మునుగుతున్న అమాయక కస్టమర్లు
- ఆంధ్రా బాట పట్టిన కొనుగోలుదారులు, అశ్వారావుపేటలో కుదేలవుతున్న వ్యాపారం
- అధికారుల నిర్లక్ష్యంపై 'నవతరం' గర్జన, రంగంలోకి దిగకపోతే పోరాటం తప్పదు
- వినియోగదారులారా మేల్కొనండి,1915 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయండి









**నవతరం ప్రతినిధి: ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

నిబంధనల ప్రకారం ఒక కస్టమర్ బంగారం కొనుగోలు చేస్తే సదరు దుకాణదారుడు కంప్యూటరైజ్డ్ జీఎస్టీ ఇన్వాయిస్ (పక్కా బిల్లు) ఇవ్వాలి. కానీ, అశ్వారావుపేటలోని మెజారిటీ దుకాణాల్లో ఈ పద్ధతి కానరావడం లేదు. కస్టమర్ బంగారం కొనగానే,ఒక తెల్ల కాగితం ముక్కపై చేత్తో బరువు, రేటు రాసి చేతిలో పెడుతున్నారు. ఇలా తెల్ల కాగితాలపై ఇచ్చే 'కచ్చా' బిల్లుల వెనుక పెద్ద స్కామ్ దాగి ఉంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం బంగారు ఆభరణాలపై 3% GST వసూలు చేయాలి. పక్కా బిల్లు ఇస్తే ఈ పన్ను ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ, ఇక్కడి వ్యాపారులు కస్టమర్ల దగ్గర పన్ను మొత్తాన్ని ఏదో ఒక రూపంలో వసూలు చేస్తూ, ప్రభుత్వానికి మాత్రం

(మిగతా 2వ పేజీలో)

# పసిడి మోసాలు సరిహద్దు దోపిడీ




పైసా కట్టకుండా సొంత ఖజానా నింపుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**నాణ్యత లేని 'నకిలీ' బంగారం**

**అమ్ముకుంటే అసలు రంగు బయటపడుతుంది.**

ఈ తెల్ల కాగితం బిల్లుల వల్ల కొనుగోలుదారులకు జరిగే నష్టం అంతా ఇంతా కాదు. ఏదైనా అత్యవసరం వచ్చి కస్టమర్ అదే బంగారాన్ని తిరిగి అమ్ముకోవడానికో లేదా తాకట్టు పెట్టడానికో వెళ్లినప్పుడు అసలు కథ మొదలవుతుంది. "ఇది మీరు మా దగ్గర కొన్న బంగారం కాదు. మా ముద్ర లేదు. ఇందులో ప్యూరిటీ లేదు" అంటూ సదరు దుకాణదారులు మాట మార్చడం ఇక్కడి వ్యాపారులకు పరిపాటిగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రతీ బంగారు ఆభరణానికి 6 అంకెల హాల్‌మార్కింగ్ నంబర్ తప్పనిసరి చేసింది. ఈ నంబర్ ఉంటే బంగారం స్వచ్ఛత ఎంత అనేది కేంద్ర ప్రభుత్వ 'బి ఐ ఎస్ కేర్' యాప్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. కానీ, ఇక్కడి వ్యాపారులు హాల్‌మార్క్ లేని తక్కువ క్వాలిటీ బంగారాన్ని అంటగడుతూ, రేపు పొద్దున కస్టమర్ ప్రశ్నిస్తే బుకాయించడానికి ఈ తెల్ల కాగితం బిల్లులను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. వేరే ఊరిలో అమ్ముకుందామన్నా పక్కా బిల్లు లేకపోవడంతో దొంగ బంగారంగా అనుమానించే ప్రమాదం పొంచి ఉంది.

**ఆంధ్ర ప్రాంతాల వైపు కస్టమర్ల ప్రయాణం**

స్థానికంగా జరుగుతున్న ఈ దోపిడీని గమనించిన అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు పక్క రాష్ట్రమైన ఆంధ్రాలోని నమ్మకమైన షోరూమ్‌లను ఆశ్రయిస్తున్నారు. జంగారెడ్డిగూడెం, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు వంటి ప్రాంతాల్లోని ప్రముఖ బంగారు దుకాణాల్లో రూపాయి రూకతో సహా కంప్యూటర్ బిల్లు ఇస్తూ, ఖచ్చితమైన హాల్‌మార్క్ బంగారాన్ని విక్రయిస్తుండటంతో, స్థానిక ప్రజలు కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించి అక్కడికి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో జరగాల్సిన కోట్ల రూపాయల వ్యాపారం పక్క రాష్ట్రానికి తరలిపోతోంది. స్థానిక వ్యాపారుల స్వార్థం వల్ల మన రాష్ట్ర ఖజానాకు రావాల్సిన పన్నుల ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

**అసలు చట్టం ఏం చెబుతోంది?**

**దుకాణదారుడి బాధ్యతలేంటో చూద్దాం,,**

ఒక ఆదర్శవంతమైన పసిడి వ్యాపారంలో కొనుగోలుదారునికి, దుకాణదారునికి మధ్య జరగాల్సిన చట్టబద్ధమైన ప్రక్రియలు ఇవే: కేవలం తెల్ల కాగితాలపై చేత్తో రాసి ఇచ్చే బిల్లులు చట్ట విరుద్ధం మాత్రమే కాదు భవిష్యత్తులో వినియోగదారుడికి ఎలాంటి భద్రతా లేకుండా చేస్తాయి. బంగారం కొనుగోలు అమ్మకాలకు సంబంధించి భారత ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖ మరియు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విధించిన ముఖ్యమైన నిబంధనలు జిఎస్టి రూల్స్ ఇలా ఉన్నాయి: బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు చట్ట ప్రకారం కంప్యూటరైజిడ్ జిఎస్టి ఇన్వాయిస్ పక్కా బిల్లు ఇవ్వడం తప్పనిసరి. ప్రస్తుతం బంగారం విలువ మరియు తయారీ కూలి మొత్తం పై 3% జిఎస్టి విధిస్తారు. ఒకవేళ జ్యువెలరీ షాపు వారు మేకింగ్ చార్జీలను విడిగా చూపిస్తే ఆ చార్జీలపై 5% జిఎస్టి వర్తిస్తుంది. దుకాణం యొక్క జీఎస్టీ నెంబర్ బిల్లులో స్పష్టంగా ముద్రించి ఉండాలి. బంగారం బరువు గ్రాముల్లో, క్యారెట్, ఆరోజు మార్కెట్ ధర, మేకింగ్ చార్జీలు, మరియు విచించిన జీఎస్టీ శాతం విడివిడిగా స్పష్టంగా కనిపించాలి. తిరిగి కొనుగోలు కస్టమర్ పాత బంగారం అమ్మితే ఎలాంటి జీఎస్టీ కట్ చేయకూడదు బిల్లు లేదనే సాకుతో రేటు భారీగా తగ్గించి దోపిడీ చేయడం అస్సలు చేయకూడదు. అలా చేస్తే దుకాణా దారుడు శిక్షార్హుడు అవుతాడు.

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

అశ్వారావుపేటలో ఇంత బహిరంగంగా పనుల దొంగతనం వినియోగదారుల మోసం జరుగుతున్న సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా నిఘావర్గాలు ఉన్నతాధికారులు స్పందించి క్రింది శాఖల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలని నవతరం డిమాండ్ చేస్తుంది. వాణిజ్య పన్నుల శాఖ తక్షణమే స్థానిక బంగారు షాపులపై రైడ్ నిర్వహించి జిఎస్టి చెల్లింపులు,స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేయాలి. పన్ను ఎగవేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. దుకాణాల్లో ఉన్న బంగారంపై హాల్ మార్క్ మొక్క ఉందో లేదో నాణ్యత పరీక్షలు జరపాలి. నకిలీ బంగారాన్ని విక్రయించే ముఠాల లైసెన్సులు రద్దు చేయాలి. మోసపోయిన కస్టమర్లు బాధ్యతారహితంగా వ్యవహరించే వ్యాపారులపై టోల్ ఫ్రీ నెంబర్ 1915 కు ఫిర్యాదు చేసి తగిన బుద్ధి చెప్పాలి. స్థానిక ప్రజలారా మేల్కొనండి. రూపాయి రూపాయి కూడా పెట్టి కొనే పసిడి పై మీ హక్కులను కాపాడుకోండి. పక్కా బిల్లు ఇవ్వని దుకాణా దారులను నిలదీయండి. అక్రమార్కుల ఆట కట్టించే వరకు నవతరం ప్రజాపక్షాన పోరాడుతూనే ఉంటుంది.

# ఇన్వార్డ్ సీలు ఉంది.. సైన్ ఉంది

## రికార్డుల్లో మాత్రం శూన్యం


## ఆర్టీఐ దరఖాస్తులు చెత్తబుట్ట దాఖలా?

## మున్సిపల్ కార్యాలయంలో ప్రజల హక్కులకు తాళం

## ఆర్టీఐ దరఖాస్తుల మాయం వెనుక మర్మమేంటి?

## రిసీవ్డ్ కాపీ ఉన్నా రికార్డుల్లో జాడలేదు

## అశ్వారావుపేట మున్సిపాలిటీలో పారదర్శకతకు పాతర?



ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవతరం ప్రతినిధి అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు తీరుపై తీవ్ర అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పారదర్శక పాలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆర్టీఐ చట్టాన్ని ఇక్కడి అధికారులు అభాసుపాలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 4న మున్సిపల్ కార్యాలయానికి సమర్పించిన ఒక ఆర్టీఐ దరఖాస్తుకు నెల రోజులు గడిచినా ఇప్పటికీ ఎలాంటి సమాధానం రాకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**రిసీవ్డ్ కాపీ ఉన్నా రికార్డుల్లో లేదు. సిబ్బంది చేతులెత్తివేత**

దరఖాస్తు సమర్పించిన బాధితుడి వద్ద మున్సిపల్ కార్యాలయ అధికారిక ముద్ర, ఇన్‌వార్డ్ సిబ్బంది సంతకం చేసిన 'రిసీవ్డ్ కాపీ' స్పష్టంగా ఉంది. కానీ, మున్సిపల్ కార్యాలయ రికార్డుల్లో మాత్రం ఆ దరఖాస్తు నమోదైన ఆనవాళ్లు కూడా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 22న సదరు వ్యక్తి స్వయంగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తన దరఖాస్తు స్థితి గురించి విచారించగా, అక్కడ విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కార్యాలయంలో కమిషనర్ లేరని చెప్పిన సిబ్బంది, ఇన్‌వార్డ్ రిజిస్టర్ పరిశీలించిన తర్వాత "ఆ దరఖాస్తు మా రికార్డుల్లోనే లేదు" అంటూ నిర్లక్ష్యంగా చేతులెత్తివేయడం గమనార్హం. అధికారిక ముద్ర వేసి, సంతకం చేసి తీసుకున్న దరఖాస్తు రికార్డుల నుంచి ఎలా మాయమైంది? ఇన్‌వార్డ్ సెక్షన్ లో జరుగుతున్న లోపభూయిష్టమైన నిర్వహణకు బాధ్యులెవరు?

**నిజాలు బయటపడతాయనే భయమా? చెత్తబుట్ట దాఖలు చేస్తున్నారా?**

కార్యాలయంలోని లొసుగులు, అవినీతి అక్రమాలు లేదా కీలక సమాచారం బయటకు వస్తుందనే భయంతోనే కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ఆర్టీఐ దరఖాస్తులను కావాలనే పక్కన పెడుతున్నారా? లేక చెత్తబుట్ట దాఖలు చేస్తున్నారా? అనే బలమైన అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల హక్కులను కాపాడాల్సిన రక్షకులే భక్షకులుగా మారి ఇలాంటి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆర్టీఐ చట్టాన్ని అధికారులు ఆటబొమ్మ చేస్తున్నారా?**

సమాచార హక్కు చట్టం అనేది సామాన్యుడి చేతిలో ఒక బ్రహ్మాస్త్రం. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ చట్టాన్ని అశ్వారావుపేట మున్సిపల్ అధికారులు ఆటబొమ్మగా మార్చేశారని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దరఖాస్తులు స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయకపోవడం, సమాధానాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం చట్ట ఉద్దేశ్యానికే విరుద్ధం మరియు శిక్షార్హం.

**ప్రజల ప్రశ్నలకు మున్సిపాలిటీలో సమాధానం శూన్యం**

సమాచారం కోరుతూ అధికారికంగా దరఖాస్తు సమర్పించినప్పటికీ... నెల రోజులు గడిచినా స్పందన లేకపోవడం, ఆ తర్వాత రికార్డుల్లో లేదని సమాధానం ఇవ్వడం అధికారుల అసమర్థతకు, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా, దరఖాస్తునే మాయం చేయడం వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.

**మొదటి అప్పీల్‌తో పాటు రాష్ట్ర సమాచార కమిషన్‌కు వెళ్లేందుకు సిద్ధం**

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సదరు దరఖాస్తుదారుడు చట్టపరమైన పోరాటానికి సిద్ధమయ్యాడు. నిర్ణీత గడువు దాటినా సమాచారం ఇవ్వకపోగా, రికార్డుల్లో లేదనడంపై త్వరలోనే మొదటి అప్పిలేట్ అధికారిని ఆశ్రయించనున్నట్లు సమాచారం. అక్కడ కూడా న్యాయం జరగకపోతే, బాధ్యులైన అధికారులపై సెక్షన్ 20 కింద కఠిన చర్యలు తీసుకునేలా మరియు జరిమానా విధించేలా రాష్ట్ర సమాచార కమిషన్ వరకు వెళ్లేందుకు వెనుకాడబోనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అశ్వారావుపేట మున్సిపాలిటీలో మాయమైన ఆర్టీఐ దరఖాస్తుపై విచారణ జరిపి, బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పారదర్శకతను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అశ్వారావుపేట కోఆప్షన్ పోరు

ప్రజా సమస్యలపై అవగాహన ఉండి, గత కొన్నేళ్లుగా అశ్వారావుపేట సామాజిక సేవలో భాగస్వామ్యులైన అనుభవజ్ఞులకే కోఆప్షన్ పదవుల్లో పట్టం కట్టాలి."

**స్థానిక ఓటర్ల ఆకాంక్ష**

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనపై సరైన ప్రణాళిక ఉన్న నాయకులు పాలకవర్గంలో ఉంటేనే పట్టణ భవిష్యత్తు బాగుంటుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షాల హెచ్చరికలు.. హాట్ టాపిక్‌గా మారిన మున్సిపల్ పోరు మరోవైపు, ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ కోఆప్షన్ ఎంపికలను నిశితంగా గమనిస్తున్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం మున్సిపల్ చట్టాలను పక్కనబెట్టి ఏకపక్షంగా ఎంపికలు చేస్తే ఊరుకునేది లేదని, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ, అశ్వారావుపేట మున్సిపాలిటీలో తన పట్టును మరింత బిగించేందుకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారు? ప్రజా ఆకాంక్షల మేరకు 'అనుభవానికే' పెద్దపీట వేస్తారా.. లేక అంతర్గత పార్టీ సమీకరణాలకే మొగ్గు చూపుతారా అనేది ఇప్పుడు నియోజకవర్గంలో అత్యంత ఆసక్తికరంగా మారింది.





# ప్రజా అవసరాలకు అనుగుణంగా బీటీ రహదారి పనులు

## భగత్‌సింగ్ సెంటర్ నుంచి

## మున్సిపల్ కార్యాలయం వరకు వేగంగా కొనసాగుతున్న నిర్మాణం

నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో భగత్‌సింగ్ సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నూతనంగా చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించినట్లు సమాచారం. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో రహదారి అభివృద్ధి అవసరాన్ని మున్సిపాలిటీ అధికారులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో ఈ పనులు ప్రారంభమైనట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా ఇటువంటి బీటీ రహదారి పనులు మున్సిపాలిటీ తీర్మానాలు, సాంకేతిక అంచనాలు, ప్రభుత్వ అనుమతులు, నిధుల విడుదల తదితర ప్రక్రియల అనంతరం అమలులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించిన వైస్ చైర్మన్ ప్రజలకు దీర్ఘకాలిక ఉపయోగం కలిగేలా నాణ్యమైన రహదారిని నిర్మించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని, వర్షాకాలంలో రోడ్డు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. మున్సిపల్ కమిషనర్ కూడా పనుల సాంకేతిక అంశాలపై కాంట్రాక్టర్లకు సూచనలు చేసినట్లు సమాచారం. రహదారి నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఏసీబీ వలలో ఎమ్మార్వో సుచరిత

## 2 లక్షల లంచం తీసుకుంటూ

## శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత అరెస్ట్

## భూ కన్వర్షన్‌కు 30 లక్షల

## డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడి



శామీర్‌పేట్, నవతరం: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన దాడులు సంచలనం సృష్టించాయి. శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సోదాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘటన వివరాలను వెల్లడించారు. శామీర్‌పేట్ మండలం ఆలియాబాద్ పరిధిలోని సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి సుచరితను పట్టుకున్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ఎమ్మార్వో సుచరితతో పాటు కీసర ఆర్డీవో రాజేష్ మరియు మరికొందరు సిబ్బందిని కూడా విచారిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2024లో కూడా ఇదే శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం రేపింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడంతో జిల్లాలో విస్తృత చర్చ జరుగుతోంది.

# హైటెన్షన్ లైన్ మంటలు



**వెదురు తోట దగ్ధం.. 2 ఎకరాల పామాయిల్ తోట భస్మం**

**రైతు ఆళ్ల వెంకటేశ్వరావుకు భారీ నష్టం**

**జంపర్లు తెగినా పట్టించుకోలేదా..?**

**అగ్గి లైన్లు లేక మంటలు వ్యాపించాయా..?**

**విద్యుత్ - అటవీ శాఖల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**





నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పాపిడి గూడెం బీట్ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గంగారం సబ్‌స్టేషన్ నుంచి అడవి మార్గం గుండా పాపిడి గూడెం గ్రామానికి వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్‌లో జంపర్లు తెగిపోవడంతో చెలరేగిన మంటలు ముందుగా ఫారెస్ట్ వెదురు తోటలో పడి భారీగా మంటలు వ్యాపించాయి. అనంతరం అక్కడి నుంచి మంటలు రైతు ఆళ్ల వెంకటేశ్వరావుకు చెందిన పామాయిల్ తోటలోకి దూసుకెళ్లి రెండు ఎకరాల తోటను పూర్తిగా దగ్ధం చేశాయి. దిగుబడికి వచ్చిన పామాయిల్ చెట్లు కళ్లముందే బూడిద కావడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

### వైర్లను తాకకపోయినా ఎలా చెలరేగాయి మంటలు..?

స్థానికుల వివరాల ప్రకారం కాలిపోయిన పామాయిల్ తోట గానీ, ఫారెస్ట్ వెదురు తోట గానీ హైటెన్షన్ వైర్లను తాకలేదని తెలుస్తోంది. అయినప్పటికీ జంపర్లు తెగిపడి స్పార్కింగ్ జరగడంతో మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో విద్యుత్ లైన్ నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అడవి ప్రాంతం గుండా వెళ్లే హైటెన్షన్ లైన్‌కు క్రమం తప్పకుండా తనిఖీలు జరిగాయా..? జంపర్ల పరిస్థితిని ఎప్పుడైనా పరిశీలించారా..? వేసవి కాలంలో ప్రమాద సూచనలు ఉన్నప్పటికీ ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### 30 ఏళ్ల పాత లైన్.. పెరిగిన ప్రమాదం

గ్రామస్తుల వివరాల ప్రకారం గంగారం సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే ఈ హైటెన్షన్ లైన్ దాదాపు 30 ఏళ్ల కిందట ఏర్పాటు చేసినదిగా తెలుస్తోంది. అనంతరం ఫారెస్ట్ శాఖ వెదురు తోటలను పెంచగా, రైతులు పామాయిల్ సాగు చేపట్టారు. ఇంతకాలం లైన్ నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా..? పాత జంపర్లు, వైర్లపై ఎప్పుడైనా ప్రత్యేక తనిఖీలు జరిగాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత మాత్రం బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### అగ్గి లైన్లు లేక అడవంతా వ్యాపించిన మంటలు

అడవుల్లో వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అటవీ శాఖ "అగ్గి లైన్లు" ఏర్పాటు చేయడం సాధారణ ప్రక్రియ. అయితే పాపిడి గూడెం బీట్ పరిధిలో అలాంటి అగ్గి లైన్లు కనిపించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వెదురు తోటల్లో ఎండిన ఆకులు, పొదలు పేరుకుపోవడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించి రైతు తోటలోకి చేరాయని చెబుతున్నారు. ఫారెస్ట్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే మంటలు అంత దూరం వ్యాపించేవి కావని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

శాఖల మధ్య సమన్వయం ఎక్కడ..?

అడవి ప్రాంతం గుండా వెళ్లే హైటెన్షన్ లైన్ల విషయంలో విద్యుత్ శాఖ, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, చెట్ల పెరుగుదల, స్పార్కింగ్ ప్రమాదాలు, వేసవి కాలంలో ఫైర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై సంయుక్తంగా చర్యలు తీసుకోవాల్సి ఉండగా అలాంటి చర్యలు కనిపించలేదని విమర్శిస్తున్నారు.

ఒక శాఖ విద్యుత్ లైన్ నిర్వహణలో విఫలమైతే, మరో శాఖ అగ్ని నియంత్రణ చర్యల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిందన్న ఆరోపణలు గ్రామంలో బలంగా వినిపిస్తున్నాయి.

స్పందించని అధికారులు

ప్రమాదంపై వివరాలు తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ ఏఈకి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ అందుబాటులోకి రాలేదని గ్రామస్తులు తెలిపారు. స్థానికంగా చరవాణి ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లభించలేదని చెబుతున్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతుకు భరోసా కల్పించాల్సి ఉండగా స్పందన లేకపోవడం స్థానికుల్లో మరింత ఆగ్రహం రేకెత్తిస్తోంది.

రైతుకు న్యాయం చేయాలంటున్న గ్రామస్తులు

ప్రమాదంలో నష్టపోయిన రైతు ఆళ్ల వెంకటేశ్వరావుకు తక్షణ పరిహారం ప్రకటించాలని గ్రామస్తులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కాలిపోయిన తోటకు వ్యవసాయ, విద్యుత్, అటవీ శాఖలు సంయుక్తంగా నష్టం అంచనా వేసి ప్రభుత్వ సహాయం అందించాలని కోరుతున్నారు.

అలాగే అడవి మార్గంలో వెళ్లే హైటెన్షన్ లైన్‌పై ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాల్లో పాత జంపర్లు, వైర్లు మార్చాలని, అటవీ ప్రాంతాల్లో అగ్గి లైన్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

"రైతు శ్రమకు విలువ లేదా..?"

ఏళ్ల తరబడి శ్రమించి పెంచుకున్న తోట క్షణాల్లో బూడిదైపోయినా బాధ్యత ఎవరిది అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడవిలో విద్యుత్ లైన్ వెళుతుంటే భద్రతా చర్యలు తీసుకోవాల్సింది ఎవరు..? అగ్గి లైన్లు ఎందుకు లేవు..? జంపర్లు ఎందుకు తెగాయి..? ప్రమాదం తర్వాత అధికారులు ఎందుకు స్పందించలేదు..? అనే ప్రశ్నలు ఇప్పుడు పాపిడి గూడెం గ్రామంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

# అభివృద్ధికి స్థల గండం



కాగితాలకే పరిమితమైన సంక్షేమ పథకాలు

**కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల పాలు.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు**

**రూ. లక్షల్లో పలికే భూముల ధరలు.. దాతలు కరువై, కొనుగోలు చేయలేక పంచాయతీ సతమతం**

**అభివృద్ధికి స్థల శాపం,కాగితాలకే పరిమితమైన అంగన్వాడి,వివో భవనాలు**

**సర్వేనెంబర్ 393లో చెరువు మాయం,కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులపై బడాబాబుల కన్ను**

**తాగునీటి ట్యాంకులకు సబ్‌స్టేషన్కు దొరకని గజం స్థలం, పొట్లపల్లి లో నిలిచిన ప్రగతి చక్రం**

**నిమ్మకు నీరెత్తినట్లు రెవెన్యూ యంత్రాంగం, కలెక్టర్ స్పందించాలంటున్నా గ్రామస్తులు**







**(నవతరం ప్రతినిధి): ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

ప్రజల చెంతకు సంక్షేమ ఫలాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ ఆర్గనైజేషన్ (వివో - వెలుగు) భవనాలు, రక్షిత మంచినీటి ట్యాంకులు వంటి ఎన్నో నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోంది. కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో ఈ నిధులు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఒకప్పుడు ప్రజాప్రయోజనాల కోసం భూములను దానం చేసే దాతలు ఉండేవారు, కానీ నేడు భూముల ధరలు రెక్కలు తొడగడంతో ఆ పరిస్థితి కాస్తా మృగ్యమైంది. కనీసం పంచాయతీ నిధులతో స్థలాన్ని కొనుగోలు చేద్దామన్నా నిధులు సరిపోని పరిస్థితి. దీనికి తోడు ఉన్న కాస్త ప్రభుత్వ భూమిని సైతం కొందరు బడా బాబులు అడ్డగోలుగా ఆక్రమించుకోవడంతో గ్రామాల్లో సంక్షేమ వికాసం కుంటుపడుతోంది. ఈ దుస్థితికి అద్దం పడుతోంది మండలంలోని ఊట్లపల్లి గ్రామపంచాయతీ.

### మైదాన ప్రాంతంలోనూ మచ్చుకైనా దొరకని స్థలం

ఊట్లపల్లి గ్రామపంచాయతీ భౌగోళికంగా మైదాన ప్రాంతం కావడంతో ఇక్కడ భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఎకరం భూమి ధర కొన్ని లక్షల రూపాయలు పలుకుతోంది. వెలుగు ఆఫీసులకు తావులేదు: స్వయం సహాయక సంఘాల మహిళల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన వివో బిల్డింగులను నిర్మించడానికి ఊట్లపల్లిలో గజం స్థలం కూడా దొరకడం లేదు.

**దాహార్తి తీర్చే ట్యాంకులకు బ్రేక్:** గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు వాటర్ ట్యాంకులు నిర్మించాలన్నా స్థలాభావం శాపంగా మారింది.

**చీకట్లోనే ఊట్లపల్లి:** గ్రామానికి అత్యంత అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, అసలు స్థలమే లేకపోవడంతో ఆ ప్రాజెక్టు అటకెక్కినట్లయింది. భూముల ధరలు పెరగడంతో

### దాతలు వెనకడుగు వేస్తున్నారు. పంచాయతీ ఖజానా చూస్తే ఖాళీ.

భూముల ధరలు ఆకాశాన్ని తాకడంతో దానాలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పోనీ, పంచాయతీ నిధులతో మార్కెట్ ధరకు స్థలాన్ని కొనుగోలు చేసి ఈ నిర్మాణాలను చేపడదామంటే, అంతటి ఆర్థిక బలం పంచాయతీకి లేదు.

### చెరువు శిఖం భూమి సైతం ఆక్రమణం:

సర్వే నెంబర్ 393లో భారీ దోపిడీ జరిగింది.

ఒకవైపు ప్రభుత్వ భవనాలకు స్థలాలు లేక అధికారులు చేతులెత్తేస్తుంటే, మరోవైపు ఉన్న ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణల పాలవుతున్నాయి. ఊట్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 393 లో ఉన్న చెరువు శిఖం భూమిని ఏకంగా ఒక స్థానిక రైతు అక్రమంగా ఆక్రమించి తన సొంతానికి వాడుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సహజ వనరులను, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన భూమి ఇక్కడ బహిరంగంగానే దోపిడీకి గురవుతోంది. కోట్ల రూపాయల విలువైన ఈ భూమిని కాపాడితే, గ్రామానికి అవసరమైన అన్ని ప్రభుత్వ భవనాలను ఇక్కడే నిర్మించుకునే అవకాశం ఉంటుంది. కానీ, ఈ ఆక్రమణను ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు.

### నిమ్మకు నీరెత్తినట్లు రెవెన్యూ డిపార్ట్మెంట్

ఊట్లపల్లిలో ఇంతటి బహిరంగ భూ దోపిడీ జరుగుతున్నా, అశ్వారావుపేట మండల రెవెన్యూ అధికారులు మాత్రం 'కంటితుడుపు' చర్యలతో సరిపెడుతున్నారనే విమర్శలు తీవ్రస్థాయిలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన స్థలాలను గుర్తించి, వాటిని గ్రామపంచాయతీకి అప్పగించడంలో రెవెన్యూ యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోకపోగా, కనీసం ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు కూడా చొరవ చూపకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించండి.

ప్రభుత్వ ఆస్తులు కొందరి స్వార్థానికి బలైపోతుంటే చూస్తూ ఊరుకోవడం సమంజసం కాదు. అశ్వారావుపేట మండల ఉన్నతాధికారులు మరియు జిల్లా కలెక్టర్ వారు వెంటనే స్పందించి,

ఊట్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 393 లో జరిగిన చెరువు శిఖం భూమి ఆక్రమణలపై తక్షణమే విచారణ జరపాలి. ఆక్రమణలను తొలగించి, ఆ భూములను వెంటనే గ్రామపంచాయతీకి అప్పగించాలి. తద్వారా నిలిచిపోయిన వివో భవనాలు, వాటర్ ట్యాంకులు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలకు అడ్డంకులను తొలగించి ఊట్లపల్లి గ్రామ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించాలి.

లేనిపక్షంలో ప్రభుత్వ భూముల రక్షణ కోసం, గ్రామాభివృద్ధి కోసం ప్రజలతో కలిసి 'నవతరం' పోరాటాలకు మద్దతుగా నిలుస్తుంది.



# కూతురుతో కలకత్తాపురిలో..



సంక్రాంతి విజయం 'మన శంకర వరప్రసాద్‌గారు'తో ఈ ఏడాది శుభారంభాన్ని పలికారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఆయన తదుపరి చిత్రం 'విశ్వంభర' కూడా ఈ ఏడాదే విడుదల కానున్నది. ఇదిలావుంటే.. కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో చిరంజీవి ఓ చిత్రాన్ని చేయనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానున్నది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య'తో బ్రదర్ సెంటిమెంట్‌తో ఆడియన్స్‌ని ఆకట్టుకున్న దర్శకుడు బాబీ.. ఈ సారి మెగాస్టార్‌లో అద్భుతమైన తండ్రిని ఆవిష్కరించనున్నారట. తండ్రీ-కూతుళ్ల సెంటిమెంట్ చుట్టూ ఈకథ నడుస్తుందని, అలాగే, కోల్‌కతా నగర నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని విశ్వసనీయ సమాచారం. పవర్‌ఫుల్ మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ చిత్రంలో మెగాస్టార్ కూతురి పాత్రకు 'జీనియస్'ఫేం అనస్వర రాజన్‌ని ఎంపిక చేసినట్టు తెలిసింది. గతంలో కోల్‌కతా నేపథ్యంలో కూతురిని అన్వేషించే తండ్రిగా 'చూడాలని ఉంది' చేశారు చిరంజీవి. ఈసారి టీనేజ్‌లో ఉన్న అమ్మాయి తండ్రిగా అదే కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తారన్నమాట. మెగా అభిమానులకు ఇది నిజంగా ఉత్సాహాన్ని నింపే వార్తే.



# తిమ్మరాజుపల్లి జ్ఞాపకాలు

'సమ్మర్ వెకేషన్‌కి ఊరికెళ్లినట్టే, ఈ సారి మా 'తిమ్మరాజుపల్లి'కి రండి. మీ ఊరు గుర్తొస్తుంది. నాటి జ్ఞాపకాలు గుర్తొస్తాయి. ముఖ్యంగా 50ఏళ్లు దాటిన వారికి మా సినిమా బాగా నచ్చుతుంది. టీవీ కొనేందుకు, టీవీ చూసేందుకు వారెలా స్ట్రగుల్స్ పడ్డారు? ఎలాంటి అనుభూతికి లోనయ్యారు? అనేది వాళ్లకు మరోసారి గుర్తొస్తుంది. అలాగే 30, 40 ఏళ్ల వాళ్లకు కూడా సినిమా బాగా నచ్చుతుంది. ఎందుకంటే వాళ్లు టీవీ తొలి వీక్షకులు కాబట్టి. మొత్తంగా ఈ సినిమా ఓ జ్ఞాపకాల దొంతర. మేం కష్టపడ్డామని సినిమా చూడమని చెప్పను. ఈ మూవీ ట్రైలర్, సాంగ్స్, కంటెంట్ చూడండి. నచ్చితే థియేటర్స్‌కి వెళ్లి చూడండి' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కొత్త ప్రతిభను పరిచయం చేయాలనే దృక్పథంతో తన కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై సుమైనా స్టూడియోస్‌తో కలిసి కిరణ్ అబ్బవరం నిర్మించిన వైవిధ్యకథాచిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ జంటగా నటించారు. వి.మునిరాజు దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ డ్రామా ఏప్రిల్ 17న థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. ఇంకా ఈ సినిమాలో భాగం అయినందుకు చిత్రబృందమంతా ఆనందం వ్యక్తం చేసింది.

# పర్సంటేజీ విధానంపై వివాదం..
# మే 1 నుంచి థియేటర్ల బంద్ యోచన




మల్టీప్లెక్స్‌ల తరహాలోనే సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా పర్సంటేజీ విధానంలో సినిమాల్ని ప్రదర్శించాలని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని 23 సింగిల్ స్క్రీన్స్ థియేటర్ల యజమానుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. దీనిని నిర్మాతల గిల్డ్ వ్యతిరేకించింది. థియేటర్లకు పర్సంటేజీ ఇవ్వడం కుదరదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల గిల్డ్ మధ్య వివాదం మరింత పెద్దదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తమ నిర్ణయాన్ని కాదని నిర్మాతల గిల్డ్ స్పందించడంపై ఫిల్మ్ ఛాంబర్ ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలో పర్సంటేజీ విధానం అమలుపై ఈ నెల 30లోగా తుది నిర్ణయం తీసుకోవాలని, లేకుండా మే 1 నుంచి సింగిల్ స్క్రీన్ థియేటర్లను బంద్ చేసే ఆలోచనలో ఉన్నామని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ సంఘం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం ఎలాంటి మలుపులు తీసుకుంటుందోనని సినీ వర్గాల్లో ఆందోళన నెలకొన్నది.




# అంచనాలన్నీ నిజమయ్యాయి!

'మేము ప్రేమతో ఈ సినిమా చేశాం. మీరు కూడా ప్రేమతో చూశారు. నాకు మరో సక్సెస్ ఇచ్చినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా షానియల్ డియో దర్శకత్వంలో సుప్రియా యార్లగడ్డ నిర్మించిన 'డెకాయిట్' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందు కొచ్చింది. హైదరాబాద్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్రబృందం సినిమాను వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అడివి శేష్ మాట్లాడుతూ.. విడుదలైన అన్ని కేంద్రాల నుంచి సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్నదని, త్వరలో చాలా నగరాలు తిరిగి ప్రేక్షకుల్ని కలుసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. సినిమాలో తాను పోషించిన సరస్వతి పాత్ర అందరికీ నచ్చిందని కథానాయిక మృణాల్ ఠాకూర్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ సినిమా విషయంలో తాము పెట్టుకున్న అంచనాలన్నీ నిజమయ్యాయని దర్శకుడు షానియల్ డియో తెలిపారు.



# క్రీడా స్ఫూర్తిని రగిలించే రంజీ

యువ నటుడు ఆర్య హీరోగా రూపొందుతున్న స్పోర్ట్స్ యాక్షన్ థ్రిల్లర్ 'రంజీ'. పోలూరు కృష్ణ దర్శకుడు. మురుకుంట్ల అరవింద్, విజయభారతి నిర్మాతలు. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్నది. శుక్రవారం హీరో ఆర్య పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో కనిపిస్తున్న ఆర్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఈ పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉండబోతుందో ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్ చెబుతున్నది. వ్రంజనా పాండ్య కథా నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో దశరథ్, వాసుకి, ఆడుకాలం నరేన్, సమ్మెట గాంధీ కీలక పాత్రదారులు. ఈ చిత్రానికి కెమెరా: రామ్ కె.మహేశ్, సంగీతం: రథన్, సమర్పణ: ఆకృతి నంద.



# 1985 నాటి సర్కార్ బాయి

శ్రీరామ్ నిమ్మల, సాయికీర్తన జంటగా నటిస్తున్న 'సర్కార్ బాయి' చిత్రం శుక్రవారం సికింద్రాబాద్ గణేష్ దేవాలయంలో ప్రారంభమైంది. లారా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దాస్య నాయక్ క్లాప్‌నివ్వగా, నిర్మాత కెమెరా స్విఛాన్ చేశారు. తెలంగాణ సామాజిక నేపథ్య కథాంశమిదని, 1985లో జరిగిన నీటి గొడవలు, కుల వివక్షత వంటి అంశాల ఆధారంగా తెరకెక్కిస్తున్నామని తెలిపారు. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాత తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి తెలిపారు. బాహుబలి ప్రభాకర్, నాగమహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కె.శివా, దర్శకత్వం: లారా.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com